


# గూడు-నీడ

## విహారి

**జోషీ వెళ్ళిపోయాడు. 'ఇవ్వాళ్టికీ ఈవెనింగ్ వాక్ చాలు' అంటూ. ఏదో ఆలోచిస్తూ చాలా దూరం వచ్చాడు శ్రీరాములు.**

**దూరంగా నగరం వివరం లేని సవ్వడులు చేస్తుంది. హైవే మీద ట్రక్కుల రొద. వంతెన పిట్టగోడమీద కూచున్నాడు. రాత్రి అనాదరంగా, యాంత్రికంగా లోకం మీద పడబోతోంది.**

జోషీ చెప్పిన సంగతులు గుర్తుకొస్తున్నై. ఆయన ఈ వానప్రస్థాశ్రమంలో చేరటానికి దోహదం చేసిన కారణం చెప్పాడు.

జోషీ మేనమామ పక్షవాతంతో బాధపడ్తూ వుండేవాడుట. వార్ధక్యంలో అనారోగ్యంతో వున్న ఆయన్ని, ఆయన ముగ్గురు కొడుకులూ పిల్లిని తిప్పినట్టు తిప్పుతూ పంచుకున్నార్ట. ఒక్కొక్కడి ఇంట్లో నాలుగు నెలల మకాం. నాలుగు నెలల మీద ఒక్క రోజు కూడా ఆయన ఆ యింట్లో వుండకూడదు. అంత అనారోగ్యంలోనూ ఆయన ఆలాగే తిరుగుతూ వుండేవాడుట.

ఒకసారి, రెండో కొడుకు దగ్గర వుండగా గడువు తీరిన తర్వాత ఆయన్ని తనింటికి తీసికెళ్ళడానికి మూడో కొడుకు రాలేదు. ఐదురోజులు గడిచినై. ఆరో రోజు వచ్చాడతను. అతని భార్యకు ఆరోగ్యం సరిలేకపోవడంతో ఆలస్యం అయిందిట. కారణమేదయినా రాలేక పోయాడు. రానందుకు రెండోకొడుకు తమ్ముడిని తిట్టాడు. అతనూ వూరుకోలేదు. ఒకరినొకరు తిట్టుకుని రాద్ధాంతం చేసుకుని చివరికి తండ్రిని కూడా తిట్టిపోశారుట. ఆ ఆరురోజుల 'మెయింటెనెన్స్ ఛార్జెస్' ని తమ్ముడి దగ్గర వసూలు చేసిన తర్వాతే వాళ్ళని కదలనిచ్చాడతను.

తనకూ, తన ముగ్గురు కొడుకుల నుంచీ తన మేనమామ పరిస్థితి ఎదురు కాకూడదని ఉన్న యిల్లు అమ్మేసి ఆ డబ్బుని పెట్టుకుని ఇక్కడకొచ్చి చేరాడుట. భార్యపోయిన తర్వాత ఇల్లు అమ్మేసి డబ్బు పంచమనే కొడుకుల వత్తిడి భరించలేక వచ్చేశానన్నాడు జోషి. పాటికి పదిసార్లు– ' ఇవ్వాళారేపూ, మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అంటూ విరక్తిగా నవ్వుతాడు. మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ నుంచీ వచ్చాడు జోషి.

శ్రీరాములు లేచి నడక మొదలెట్టాడు.

హైవే పక్కగా సర్వీస్ రోడ్‌లో దీపాలు వెలిగినై. ఆశ్రమం ఉండీలేనట్టు దృగ్గోచరమవుతోంది. ఆ రోడ్డులోనే నడుస్తున్నాడు శ్రీరాములు. మనస్సు పరిపరివిధాల పోతోంది. లీలగా ఎవరెవరో వ్యక్తులూ, ఏవేవో ఘటనలూ ఆలోచనల్ని కుదుపుతున్నై. తల విదిలించుకుంటూ వాటిని పక్కకి తొలగిస్తూ నడుస్తున్నాడు.

తామీ ఆశ్రమంలో చేరి ఆరునెలలే అయింది. ఆశ్రమంలో మొత్తం నలభై మంది సభ్యులు. ఇరవై కాటేజ్‌లలో డబుల్ షేరింగ్ పద్ధతిన నివాసం. రెండు లక్షల రూపాయల డిపాజిట్. నెలనెలా మెస్ ఛార్జీలు ఎంత అయితే అంతా అందరూ కలిసి భరించుకోవాలి. సభ్యుల్లో నుంచీ ఐదుగురు సభ్యులతో మెస్ కమిటీ వుంది. అలాగే మెయింటెనెన్స్ కమిటీ, కల్చరల్ కమిటీ వున్నై.

దేశంలోని వివిధప్రాంతాల నుంచీ వచ్చి చేరారు ఈ నలభై మందీ. అందులో ఆరుగురు తెలుగువాళ్ళు. ఒక్కొక్కరికీ ఒక్కొక్క 'చేంతాడు' కథ వుంది. ఎవరికి వారికి తమవైన వెలుగు నీడలున్నై. పలుకూ, పలుకుబడీ వున్నై. కొందరికింకా చింత చచ్చినా పులుపు చావని ఉద్రేకం, ఉద్వేగం వున్నై. ఓ నలుగురైదుగురు అజీ

ర్ణరోగులు. కొద్దిమంది మాత్రం- అన్నీ వడ్డించిన విస్తళ్ళు. ఎక్కువమంది- నవ్వే పెదవులూ, ఏడ్చేకళ్ళ ఇరుకున బడిన బ్రతుకులే. పదిమంది దాకా భార్యాభర్తల జంటలు. అంతా అరవై పై బడిన వయస్సు దుప్పటిని కప్పుకున్నవాళ్ళే.

ఆశ్రమం గేటులోకి ప్రవేశిస్తుండగా- ఎదురు హాల్లో నుంచీ అరుపులు హెచ్చుస్థాయిలోనే వినిపించినై శ్రీరాములుకి. అదే ప్రేయర్ హాలు. ఏదో గలాటా జరుగుతోందనిపించింది. వడివడిగా అటుకేసి నడిచాడు.

డైనింగ్‌హాలు కూడా అదే. మెస్ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్య మధ్యలో వున్నాడు. పది, పదిహేను మంది సభ్యులు నిలబడి వున్నారు. నలుగురైదుగురు ఆడవాళ్ళూ వున్నారు. వెళ్ళి బెనర్జీ పక్కగా నిలబడ్డాడు. హిందీలో, ఇంగ్లీషులో సాగుతోంది చర్చ.

''రోజూ ఈ చప్పిడి కూడు తినలేక చస్తున్నాం. మెనూ మార్చమంటే మార్చరు. కుక్‌నీ మార్చరు. ఎట్లా చచ్చేది.''

''మేమూ పైసలిస్తున్నాం ఊరికే ఏమీ పెట్టడం లేదు.''

''వాళ్ళ నంబర్ ఎక్కువని దబాయింపు.''

క్షణాల్లో అర్థమైంది శ్రీరాములికి. ఒక వారం క్రితం- ఆదివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ దగ్గరా ఇలాంటి చర్చలూ, వాదనలూ, జరిగినై. ఆవేళ చినికి చినికి గాలివానగా మారి, శృతిమించి రాగాన పడింది పరిస్థితి. అప్పుడు బెనర్జీ సర్దిచెప్పాడు. మా అందర్లోనూ వయస్సులో పెద్దవాడు బెనర్జీ. మనిషి సౌమ్యుడు. మాట తీరుకూడా చాలా సాత్వికంగా వుంటుంది. ఆయనంటే అందరికీ గౌరవభావం వుంది.

సుబ్రహ్మణ్య గొంతు చించుకుంటున్నాడు. ''ఇట్లాగైతే ఎట్లాగండీ. మెస్ కమిటీ వారంలో అన్ని రోజులకీ మెనూ తయారు చేసి సర్క్యులేట్ చేసింది గదా. దానిప్రకారం పోతున్నాం. చీటికీ మాటికీ మధ్యలో ఇట్లా తగాదా వేసుకుంటుంటే ఎట్లా. సరే ఇక మీరే చూసుకోండి. ఏం చేయిస్తారో, ఏం తింటారో మీ యిష్టం. నేనిప్పుడే తప్పుకుంటున్నాను.''

కాడిపారేస్తూ కింద కూర్చున్నాడు. మనిషి కొంచెం మొండి. దానికి తోడు మాట పెళుసు. తనకు అదే కిరీటంగా భావిస్తాడు. అయితే, కార్యదక్షత పుష్కలంగా వున్నవాడు కావడంతో ఇలాంటి పనులకి అతని మీదే ఆధారపడతారు సభ్యులు.

సుబ్రహ్మణ్య మాటలకి అందరూ మొహాలు చూసుకున్నారు. అప్పటికే మనుషుల మనసుల పళ్ళచక్రంలో పడిపోయింది- ఉత్తర దక్షిణాల రాగద్వేషాల చెరకుగడ.

పట్టుదలకి పోతే వాక్ హింస మాటెలా వున్నా పొయిలో పిల్లి లేవదని అందరికీ తెలుసు బెనర్జీ మాట కలుపుతూ అన్నాడు. ''ఈ విషయానికి ఇంత రభస చేసుకోవడం ఎందుకు? మెస్ కమిటీ కలిసి మెనూని సమీక్ష చేస్తే సరి. కుక్‌కి అవసరమైన సూచనలిద్దాం సరిపోతుంది.

కొన్ని గొంతులు ''అవునవునంటూ శృతి కలిపినై. గొణుక్కుంటూ కదిలారందరూ. హాలు పల్చబడింది. శ్రీరాములూ బయటికి నడిచాడు. కాటేజ్‌కి చేరుకున్నాడు.

''సుజాత ఫోన్ చేసింది అస్సలు పనిచేసుకోలేకపోతోందిట. వాళ్ళత్తగారు రానందిట. నన్ను రమ్మంటోంది. డెలివరీ అయ్యే దాకా వుండాలిట. దేశం కాని దేశంలో నాకెవరున్నారనీ. నువ్వూ ఇట్లావదిలేస్తే ఎట్లాగే అంటూ ఏడుస్తోంది. దానికిప్పుడు ఏడోనెల. తెలుసుగా.'' లోపలికి వెళ్తూనే భార్య కనకం చెప్పింది. విడిచిన బట్టలు వంకీకి తగిలిస్తూ ఏదో అనబోయి భార్య మొహం చూసి వూరుకున్నాడు. మౌనంగానే స్నానం పూర్తిచేసి వచ్చాడు. ముందు గదిలో కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తీశాడు. పరధ్యానంగా పేజీలు తిరగేస్తున్నాడు.

తానూ స్నానం పూర్తి చేసి వచ్చి కూర్చుంది కనకం.

''ఏంచేద్దామంటారు'' అంది.

పెదవి విప్పకుండా ఆమె వైపు పరిశీలనగా చూశాడు శ్రీరాములు. ఎందుకనో- ఆమె మనసు కూతురి ప్రతిపాదనను అంగీకరిస్తున్నదేమో అనిపించిందతనికి.

తనవైపు రెప్పవేయకుండా చూస్తున్న భర్త చూపుల్ని తప్పించుకోడానికన్నట్టు జుట్ట ముడి సర్దుకుంటూ లేచి లోపలికి వెళ్ళింది కనకం.

'మనిషి సన్నగా వుండటంకూడా కారణం కాబోలు, ఎనర్జీ లెవెల్ ఎక్కువగా వుండటానికి. యిప్పటికీ ఈమెకు పని పట్ల ఉత్సాహమూ, ఓపికా తగ్గలేదు. కొడుక్కీ, ముగ్గురు ఆడపిల్లకీ అన్ని బాధ్యతల్ని నిర్వహించినా, అప్పటికీ- ఇప్పటికీ ఒక్కలా వుంది.' అనిపించింది శ్రీరాములికి.

భార్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా లోగది లోని ఆమెకు వినిపించేలా ''చూద్దాం కానీ'' అన్నాడు. ఈ పొడిమాటతో భార్యకి సంభాషణ కొనసాగించే అవకాశం ఇవ్వలేదు శ్రీరాములు.

ఇంతట్లోనే పక్క కాటేజ్ పార్వతీశం లోపలికొచ్చాడు. ఆయన మధ్యాహ్నం నుంచీ రూమ్‌లో లేడు. ఇందాక ప్రేయర్ హాల్లో జరిగిన చర్చల దగ్గరా కనిపించలేదు. శ్రీరాములకు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ..''ఇవాళ మా లీల నుంచీ ఉత్తరం వచ్చింది. అది చూసి, అలా అలా తిరిగొచ్చాను.'' అన్నాడు.

ఆయన మాట విని కనకం కూడా ముందు గదిలోకొచ్చి కూర్చుంది. పూలూ, దారం తెచ్చుకుని మాలకట్టడం మొదలెట్టింది.

లీల అంటే పార్వతీశం నాలుగో కూతురు. అమెరికాలో వుంటుంది. ఆమే, ఆమె భర్తా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వాళ్ళకో అబ్బాయీ, అమ్మాయీ. ఆ పిల్లల్ని చూసుకోడానికి తల్లిని తమ దగ్గరే వుంచుకుంది లీల. మూడేళ్ళుగా ఆవిడ అక్కడే వుంది.

పార్వతీశంకి మగపిల్లల్లేరు. పెద్దకూతుళ్ళు ముగ్గురూ మన దేశంలోనే వున్నారు. అల్లుళ్ళవి అంతంత మాత్రం సంపాదనలే. వాళ్ళవరకూ ఫరవాలేదు.

'మనిషి సన్నగా వుండటంకూడా కారణం కాబోలు, ఎనర్జీ లెవెల్ ఎక్కువగా వుండటానికి. యిప్పటికీ ఈమెకు పని పట్ల ఉత్సాహమూ, ఓపికా తగ్గలేదు. కొడుక్కీ, ముగ్గురు ఆడపిల్లకీ అన్ని బాధ్యతల్ని నిర్వహించినా, అప్పటికీ- ఇప్పటికీ ఒక్కలా వుంది.' అనిపించింది శ్రీరాములికి.

ఇదుగో, ఈ లీల చదువూ, ఆ తర్వాత అమెరికాలో జాబ్ చేస్తున్నతనితో పెళ్ళీ- పార్వతీశం కుటుంబాన్ని వో కుదుపు కుదిపింది. నాకేం చేశారంటే నాకేం చేశారని పెద్దపిల్లలు ముగ్గురూ గాలివానల్నీ, ఉప్పెనల్నీ కల్పించారు. ఉన్నదంతా తలా కాస్తా పంచేయమన్నారు. విశాఖలోని ఇంటిని అమ్మేయమని పట్టుపట్టారు. ఇల్లు పోయింది. వచ్చిన తొమ్మిది లక్షలూ తమకే పంచమన్నారు. పెద్ద షష్ఠాష్టకం తర్వాత అమ్మా నాన్నలకీ రెండు లక్షలు వదిలారు.

లీల అమ్మకూచి. ఈ అమ్మకీ లీలంటే ఒక వాసి మొగ్గు. అందుకనే ఆ పిల్ల ఈమెని తీసుకుపోయింది. పార్వతీశంకి వానప్రస్థాశ్రమం ఏర్పడింది.

అప్పుడప్పుడూ పార్వతీశం చెప్పుకున్న ఆటోబయోగ్రఫీ ముక్కల్ని పేరిస్తే వచ్చే రూపం ఇది.

భార్య ఆరోగ్యం అంతంతమాత్రం. అక్కడెలా వుందో ఏమో అనే బెంగ అప్పుడప్పుడూ ఆయన మాటల్లో ద్యోతకమౌతూ వుంటుంది.

కిటికీలో నుంచీ పల్చటి వెన్నెల పడుతోంది మంచం మీద.

పార్వతీశంవైపు పరీక్షగా చూశాడు. మనిషి బాగా ఎత్తరి. మంచంమీద కాళ్ళు చారసాచిపడుకుంటే పాదాలు బయటే ఉంటాయి. నిమ్మపండుచాయ. నుదుట గంగమట్టిబొట్టుతో పురోహిత వేషంలో వుంటాడు.

''చెప్పండి మీ లీల ఏమంటోంది?'' అన్నాడు.

''వాళ్ళమ్మకి అసలు బాగా లేదుట. ఆస్తమా ఎక్కువైందట. అక్కడ వైద్యం చేయించాలంటే చాలా ఖర్చు అవుతుందిట. అందుకని ఇండియాకి పంపించేద్దామనుకుంటున్నాం అంటోంది.'' ఉపాధ్యాయుడి ప్రశ్నకి మాటలు కూడతీసుకుంటూ చెప్తున్న విద్యార్థి సమాధానంలా వుంది.

క్షణం తర్వాత ఆయనే అన్నాడు. ''ఆ ఎటాక్ ఉధృతంగా వచ్చినప్పుడల్లా హాస్పటల్‌లో చేర్చాలంటే అమెరికాలో అయ్యే పనికాదు.'' అని రాసింది.

''పోనీలెండి. అంతో యింతో ఇచ్చి పంపుతారు. అమె కూడా మీతో వుంటుంది'' మార్దవంగా అన్నాడు శ్రీరాములు.

పార్వతీశం సన్నగా నవ్వేడు. ''ఆ తర్వాత రాసిన ఘోషంతా అదే. ఇన్నాళ్ళుగా పెద్దగా దాచిందేమీ లేదుట. మీరే ఎలాగో మేనేజ్ చేసుకోవాలి'' అని సలహా ఇస్తోంది. అని క్షణాల తర్వాత మళ్ళీ తానే అన్నాడు. ''ఇప్పుడు నా అసలు సమస్య కాటేజ్. ఆశ్రమంలో ఖాళీల్లేవు. ఆమె ఇక్కడికి వచ్చి నాతో వుండే అవకాశం లేదు. తాత్కాలికంగానైనా తనని పెద్ద పిల్లల్లో ఎవరు రానిస్తారో అని తేల్చుకోవాలి. మన రూల్స్ మీకూ తెలుసుగా. నేనే ఆమెని తెచ్చుకోవాలంటే ఖాళీ వచ్చేదాకా ఆగాల్సిందే. కాక నేనే వెళ్ళిపోవాలంటే డిపాజిట్‌లో కొంతపోతుంది కదా. ఏమిటో- అంతా అయోమయంగా వుంది. మళ్ళా

పిల్లల్ని పిలిచి సంప్రతింపులు జరపాలి. తప్పదు.''

మాటల్లోనే డిన్నర్ బెల్ మోగింది. వాచీ చూసుకున్నారు. ఎనిమిదిన్నర. ''సరే పదండి' అంటూ కదిలారు. తలుపు తాళం వేసి తానూ వాళ్ళని అనుసరించింది కనకం.

భోజనాల దగ్గర కూడా మీల్స్, టిఫిన్ పదార్థాల మీద మళ్లీ చర్చా. అసంతృప్తీ సాగింది. ఈ చర్చ కాకెక్కి వాతావరణాన్ని కలుషితం చేస్తున్న సమయంలో బెనర్జీ కలుగజేసుకుని శాంతింపజేశాడు.

రూమ్‌కి తిరిగి వస్తుంటే- జోషి మాట కలుపుతూ అన్నాడు. ''మనం ఇక్కడికి వచ్చింది ప్రశాంతంగా బతకటానికి కదా. ఈ ఆవేశకావేశాలూ, ఇష్టానిష్టాలూ, మొహాలు చెండుకోవడం దేనికి? అందరమూ- బతికినంత కాలం బతకబోనివాళ్ళమే. నేనీ మాటంటేనే కదా సుబ్రహ్మణ్యకీ ఉదయం కోపమొచ్చింది.''

అందరూ ఆలోచనలోపడ్డారు. 'అవునవును' ఆలోచనల్లోంచీ అన్నాడు పార్వతీశం.

''తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి.'' అననే అన్నాడు భగవాన్ అంటూ సన్నగా నవ్వేడు జోషి.

వాతావరణం గంభీరంగా మారింది. నెమ్మదిగా ఎవరి కాటేజ్‌కి వాళ్ళు కదిలేరు.

***

ట్యూబ్ లైట్ ఆర్పేసి చిన్న లైట్ వేసి తానూ పడుకుంది కనకం. శ్రీరాములికి నిద్ర రావడం లేదు. మనస్సు గతం చట్రంలో కుడికీ ఎడమకీ గిరికీలు కొడ్తోంది.

తండ్రిపోయేనాటికి ఆరెకరాల మాగాణీ తమది. పొలం పంచుకుపోతామన్నారు. తమ్ముడూ-మరదలూ. వాడికీ ఇద్దరు పిల్లలు. 'సరే'-అనుకున్నారు. పల్లెలో ఇల్లూ అమ్మేశారు. అప్పూ సొప్పూ పోను, అణాబేడా ఇద్దరు చెల్లెళ్ళకూ ముట్టచెప్పి, లెక్కలు చూసుకుంటే- తన భాగం ఎకరంన్నర చేతికొచ్చింది. బండెడు చీకటి నెత్తికెక్కుకుని పట్నం చేరారు. ఫ్యాక్టరీలో ఉద్యోగం. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితిలోపడ్డాడు. ముగ్గురు కూతుళ్ల పెళ్ళిళ్ళు చేసేసరికి ఉన్న పొలం కాస్తాపోయింది. చంద్రం ఎం.కాం. పూర్తి చేస్తూనే బ్యాంక్ వుద్యోగం వచ్చింది. ఒక ఏడాది పాటు ఊపిరి పీల్చుకున్నారు. వేన్నీళ్ళకి చన్నీళ్ళుగా కొడుకు సాయం అందింది.

అంతలోనే- అస్పష్టంగా వినిపించిన వాస్తవం స్పష్టంగా కనిపించింది. చంద్రం తన సహోద్యోగి శ్వేతని ప్రేమించానన్నాడు. కులాంతర వివాహం. శ్వేత రెడ్డిగారమ్మాయి. పెళ్ళికాగానే వేరే వెళ్ళిపోయాడు. అన్ని ఘటనలూ ఆకులు రాలినట్లు జరిగిపోయినై.

గుండెల్లో పాతికేళ్ళు పెంచుకున్న ధైర్యం, భరోసా ఒక్కసారిజారిపోయినట్లయింది. తెలియని వెలితి. పిచ్చి మొద్దు- కనకం అయితే- అడపాదడపా కొడుకు గురించి కళ్ళు చెమర్చుకుని ముక్కు చీదుకునేది. చంద్రంతోపాటు పెరట్లో పెరిగిన నిమ్మ చెట్టుని చూస్తుంటే వొళ్ళంతా ముళ్ళు చేసుకున్నట్లనిపించేది.


> శ్రీరాములు ఫ్యాక్టరీలో పిడుగులాంటి వార్త వచ్చింది. ఫ్యాక్టరీ మూసెయ్యటం ఖాయమని. అంపశయ్య మీదికి నెట్టేసినట్ల య్యింది. ముద్దనోట్లోకి పోయేది కాదు. తిన్న ముద్ద ఉన్న ఆకలిని పెంచేది. ఫ్యాక్టరీలో అందరూ పత్తి కాయల్లాంటి గుడ్లతో శూన్యంలోకి చూస్తూ, కదిలే శవాల్లా మారిపోయారు. ఆలోచనలూ, భయమూ తెల్లవారనిచ్చేలోగానే- యజమాన్యం కార్మికుల బ్రతుకుల్ని తెల్లవార్చేసింది. లెక్కలు తేల్చి నాలుగురాళ్ళు చేతిలో వేసి, చేతులు దులుపుకుంది.


చంద్రం వెళ్ళిపోయి నిండా ఆర్నెల్లుకూడా కాలేదు.

ఒకరోజు-

శ్రీరాములు ఫ్యాక్టరీలో పిడుగులాంటి వార్త వచ్చింది. ఫ్యాక్టరీ మూసెయ్యటం ఖాయమని. అంపశయ్య మీదికి నెట్టినట్లయ్యింది. అలజడి, ఆదోళన, యూనియన్లూ చర్చలూ, సమావేశాలూ, రాజకీయాలూ...

ముద్దనోట్లోకి పోయేది కాదు. తిన్న ముద్ద ఉన్న ఆకలిని పెంచేది. ఫ్యాక్టరీలో అందరూ పత్తికాయల్లాంటి గుడ్లతో శూన్యంలోకి చూస్తూ, కదిలే శవాల్లా మారిపోయారు. ఆలోచనలూ, భయమూ తెల్లవారనిచ్చేలోగానే- యజమాన్యం కార్మికుల బ్రతుకుల్ని తెల్లవార్చేసింది. లెక్కలు తేల్చి నాలుగురాళ్ళు చేతిలో వేసి, చేతులు దులుపుకుంది.

మల్లగుల్లాలు పడీపడీ మేథోమథనం చేసీచేసీ, చివరికి చంద్రం కేసి చూస్తే, తానుగా చెప్పలేక, భార్యచేత చెప్పించాడు.

'మేమీ బరువులూ, బాధ్యతలూ భరించలేం. మీ చరిత్రని మళ్ళీ మా తరానికి కూడా పునరావృతం చేయకండి. ఉన్న సొమ్ముతో మీరేమైనా చేసుకోండి. మీ యిష్టం.''

వారూ, వీరూ- శ్రేయోభిలాషులంతా ఈ దారే మంచిదని సలహా ఇచ్చారు.

ఊరూ, తీరూ మారింది. ఇదిగో ఈ ఆశ్రమం ఆశ్రయం అయింది.

శ్రీరాములు పక్కలో పక్కకి మసిలాడు. దూరంగా ఏదో ఫాస్ట్ ట్రెయిన్ పరిసరాల్ని దడదడలాడిస్తూ వెళ్తోంది.

ఆ తర్వాత చాలాసేపటికిగానీ శ్రీరాములుకి నిద్రపట్టలేదు.

ఒక రాత్రివేళ- ఎవరో తలుపుకొట్టుంటే లేచారు. శ్రీరాములూ కనకం. చూస్తే పార్వతీశం. వాళ్ళ మొహాల్లోకి చూస్తూ సన్ననిస్వరంతో చెప్పాడు, 'జోషి పోయాడు' అని.

ఆశ్చర్యంతో 'అరెరె.' అంటూ కదిలేరు.

'మాసివ్ హార్ట్ ఎటాక్. అంబులెన్స్‌లోకి తీసుకెళ్ళేలోగానే ప్రాణం పోయింది.' జోషి రూమ్‌మేట్ పట్నాయక్ చెప్తున్నాడు.

ఆశ్రమంలో ఇరవై నాలుగ్గంటలూ ఒక అంబులెన్స్ సిద్ధంగా వుంటుంది. డ్రైవర్ మాత్రం పక్కకాలనీలో వుంటాడు. ఫోన్ వుంది అతనింట్లో. మరీ అత్యవసరమయితే ఆశ్రమ నిర్వాహకుల్లో ఒకరిద్దరికి డ్రైవింగ్ వచ్చు. కొన్నాళ్ళక్రితం బెనర్జీకి కడుపునొప్పి- అపెండిసైటిస్ ఆపరేషన్ అవసరమైనప్పుడు, ఆశ్రమం సెక్రటరీ మహదేవన్ తీసుకెళ్ళాడు.

నిర్లిప్తంగా ఒకరినొకరు చూసుకుంటూ, శుష్కవేదాంతాలు చెప్పుకుంటూ కూర్చున్నారు అందరూ. జోషి కొడుకులకి ఫోన్‌లు చేయటంలో బిజీగా వున్నాడు సుబ్రహ్మణ్య.

మధ్యాహ్నమవుతుండగా ముంబై నుంచీ జోషి మూడోకొడుకు ప్రశాంత్ వచ్చాడు. తంతు ముగిసింది. జోషీ వెళ్ళిపోయాడు. భోజనాల దగ్గర శ్రీరాములు పక్కగా కూర్చుని వాస్తవం చెప్పాడు, ప్రశాంత్. జోషీ పెద్ద కొడుకు తాను హార్ట్ పేషెంట్ననే మిషతోనూ, రెండోవాడు కూతురి డెలివరీ అనీ రాలేమన్నారుట.

తన ఆలోచనల్లో తాను సతమతం కాసాగాడు శ్రీరాములు. భోజనం అయిందనిపించి లేచాడు. మహదేవన్ అంటున్నాడు. 'ఆశ్రమం పెట్టిన ఈ అయిదేళ్ళలో ఇదే తొలిమరణం' అని.

ఆ రోజు సాయంత్రం చంద్రం నుంచీ ఫోన్ వచ్చింది శ్రీరాములుకి. విస్తుబోవడం భార్యాభర్తలవంతయింది.

''మీరిద్దరూ అర్జంటుగా హైదరాబాద్ రావాలి. ఇవ్వాళే బయల్దేరండి. వివరాలు ఇక్కడ మాట్లాడుకుందాం.''

ఏమిటంటే చెప్పలేదు. 'చాలా అర్జెంట్' అని మాత్రమే మూడు నిముషాల్లో ముప్ఫైసార్లు అన్నాడు. కోడలు శ్వేత కూడా- ఎంతో సౌమ్యంగా పదేపదే అదే విన్నపం. విడివిడిగా శ్రీరాములుతో, కనకంతో- ఇద్దరూ మాట్లాడారు.

భార్యాభర్తలు- ఎన్నెన్నో ఆలోచించారు. అనివార్యాలే జీవితం కాబోలు అనిపించింది. సుజాత ప్రసక్తి తెచ్చింది కనకం. ఈ విషయం తేలితే, అటునుంచే వెళ్దువుగాని- అని ముగింపు చెప్పాడు శ్రీరాములు.

మూడోరోజుకి హైదరాబాద్ వచ్చారు దంపతులు.

ఆ రాత్రి-

విషయం బయటపెట్టారు కొడుకూ కోడలూ.

వాళ్ళ కూతురు పల్లవిని పెట్టుకుని ఇక్కడే వుండాలని విన్నపాలు చేశారు. ఆ పిల్లకు ఏడాది నిండింది. ఈ ఏడాది కాలంలో శ్వేత, చంద్రం ఒకరి తర్వాత ఒకరు సెలవులు పెట్టీ, శ్వేత తల్లిదండ్రుల దగ్గర అతికష్టం మీద అడపాడదపా పిల్లను వుంచీ మేనేజ్ చేశారుట. ఇక వల్ల కాదుట. శ్వేత తల్లి తెగేసి చెప్పిందిట కూతురికి- 'పిల్లను ఇంక చూడలేమని.' శ్వేతకేమో ఉద్యోగం వదిలేయటం సుతరామూ ఇష్టం లేదుట. ఇదీ సారాంశం.

రోజులెలా మారిపోతున్నాయో కొత్తగా తెలుస్తోంది శ్రీరాములుకీ-కనకానికీ. ఆనాడు ఆశ్రమానికి పోతుంటే- మాట వరసకన్నా ఆగిపొమ్మని అనని పిల్లలు వీళ్ళే! కొడుకూ కోడలూ అన్న అసలైన మరో సంగతీ- కొరుకుడుపడటంలేదు- ఈ దంపతులకి. వాళ్ళన్నారు- ''మీరు ఉండటానికి వేరే చిన్న యిల్లు చూసి ఏర్పాటుచేస్తాం. మీకూ మాకూ కూడా ఫ్రీగా వుంటుంది. ఆ అద్దె సంగతీ, పిల్ల ఖర్చూ అంతా మేం చూసుకుంటాం. ఎటూ ఆశ్రమంలో మెస్ ఛార్జీలు మీవే కదా. ఇక్కడా అలాగే గడపొచ్చు.''

పిల్ల ఖర్చుకూడా ఇస్తారుట! భేష్, ఎంత ఉదారత! 'ఎవరి దగ్గర ఖర్చు వసూలు చేసి నిన్నింతవాణ్ణి

చేశామురా బాబూ' అనిపించింది శ్రీరాములుకి.

రాత్రి నిద్రపోనీకుండా చెవినిల్లు కట్టుకుని గీపెట్టారు. చంద్రమయితే ఏడుపుకూడా ఏడాదిలో తాను పడిన కష్టాల్ని ఏకరువు పెడ్తూ, తను ట్రాన్స్ఫర్‌కి వొప్పుకోనందు వలన ప్రమోషన్ ఎలా తప్పిపోయిందో కూడా మధ్యలో చెప్పుకొచ్చాడు. ఆపైన మిధ్యా గౌరవాలూ, కుహనా సంస్కారాలూ, విన్నపాలూ, కృత్రిమ ఆప్యాయతలూ- చివరికి దేబిరింపులూ- అన్నీ సాగినై.

ఒక్కొక్కళ్ళూ ఎన్నెన్ని కొత్త రాగాలు నేర్చుకున్నారూ అనిపించింది- శ్రీరాములుకి.

రెండురోజులు గుంజాటనా, గుబులూ తర్వాత- సరేననక తప్పలేదు శ్రీరాములు దంపతులకి. 'ఎంత చెడ్డా వాడు మన కొడుకండీ' అంది కనకం. వేదాంతిలా నవ్వాడు శ్రీరాములు.

కనకం సుజాత దగ్గరికి వెళ్ళి వచ్చే వరకూ శ్రీరాములు ఒక్కడూ కొడుకింట్లోనే వుండేటట్లూ, ఆమె వచ్చింతర్వాత- వేరు కాపురం ఏర్పాట్లు జరిగేటట్లు- అన్నీ, పొల్లుపోకుండా- గుణింతాలూ, గుణిజాలుగా చెప్పేశారు చంద్రం-శ్వేత.

'రాజీ బ్రతుకులకి ఎక్కాల లెక్కలెందుకు' అని నవ్వుకున్నాడు శ్రీరాములు.

కనకం సుజాత దగ్గరికి గుజరాత్‌లోని జామ్‌నగర్ వెళ్ళిపోయింది. శ్రీరాములు ఆశ్రమంకి వచ్చి ఎకౌంట్లు చూసుకుని, పెట్టే బేడా తీసుకుని హైదరాబాద్ వచ్చేశాడు. వస్తుంటే పార్వతీశం అన్నాడు. 'వెయిటింగ్ లిస్ట్ ప్రకారం పోవాలిట. జోషీ ప్లేస్‌లో ఎవరో ఒకాయన వస్తున్నారుట. మా ఆవిడ సంగతి ఇంకా గాలిలో వుంది. బహుశా, నా పరిస్థితీ మీలాగే అవుతుందేమో' అని.

ఆశ్రమం విడిచి వస్తుంటే- పెద్ద గీతలో చిన్న అడ్డగీత స్ఫురించింది- శ్రీరాములికి. మధ్యలో వచ్చిన సంబంధం, అంతలోనే విడిపోవడం- అంతా ఆశ్చర్యంగానూ, విచారంగానూ తోచింది.

-సుజాత ఆడపిల్ల మూణ్ణెల్ల తర్వాత కనకం తిరిగి వచ్చింది. శ్రీరాములూ, కనకం, పల్లవి- చిన్న సంసారం యిప్పుడు!

-చాలా కాలమైందని ఆశ్రమానికి ఫోన్ చేశాడు- శ్రీరాములు. మహదేవన్ ఫోన్ తీశాడు. విశేషాలేమిటంటే, అన్నీ విశేషాలే అంటూ చెప్పాడు.

'పార్వతీశం ఆశ్రమం నుంచీ వెళ్ళిపోయాదు. వాళ్ళావిడా, తనూ ఢిల్లీ రెండోకూతురి దగ్గరికి చేరారుట. మరో సంగతి- సుబ్రహ్మణ్య బెంగుళూరు వెళ్ళిపోయాడుట! ఏం అంటే- ఆయనకి ఈ వాతావరణం, మనుషులూ నచ్చలేదుట' అని ముక్తసరిగా చెప్పేడు.

శ్రీరాములుకి ఆలోచిస్తుంటే ఏదీ వింతగా తోచలేదు. మనిషి బతుకులో ఏదీ అసహజం కాదేమో! ఏ సంభవానికి ఏ కార్యకారణ హేతువుని నిర్ణయించగలరు? 'చివరికి అందరి వానప్రస్థమూ ప్రశ్నార్ధకమేనా' అని మాత్రం అనిపించింది.

'ఇల్లు ఇల్లనియేవు ఇల్లునాదనియేవు ఇల్లెక్కడే రామచిలకా?' అని పక్క పోర్షన్‌లో పాట వినిపిస్తోంది.

జవాబు లేని ప్రశ్న?!

★

## లాయర్ అవ్వాలని యాక్టరయ్యింది!

**లా** చదువుతూ మధ్యలో బోర్ కొట్టి టివి రంగానికొచ్చింది నారాయణి. ముంబైకి చెందిన ఈ అమ్మాయిది సాదాసీదా కుటుంబం. ఐదుగురు అక్కయ్యలు ఒక అన్నయ్య మధ్యన పెరిగిన నారాయణికి చదువుకంటే నాటకాలంటేనే ఇష్టం. ఒకరోజు బాలాజీ టెలిఫిల్మ్ నుంచి పిలుపు వచ్చింది. 'క్యూంకీ..' సీరియల్‌లో వేషం తానై వచ్చి వరించింది. టీవీలో పేరొచ్చిన తరువాత మరాఠీ సినిమాలో ఏకంగా నానా పటేకర్ పక్కన అవకాశమొచ్చింది. అయితే నారాయణికి మరాఠీ అక్షరమ్ముక్క రాదు. ఎలాగో కష్టపడి నేర్చుకుని నటించింది. కానీ డబ్బింగ్ వేరే ఎవరో చెప్పారు. ఇప్పుడు వరుసగా హిందీ సినిమాల్లో కూడా అవకాశాలొస్తున్నాయి. గౌరవ్ అనే కుర్రాడితో ఈ అమ్మడి ప్రేమ పురాణం జోరుగా సాగుతోందట... ఇదంతా మామూలేగా.

